అందని ద్రాక్షలా హోమియో వైద్యం

- యార్లగడ్డ హోమియో ఆసుపత్రిలో వైద్యుడు లేక ఇబ్బంది పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు



యార్లగడ్డ ప్రభుత్వ హోమియో ఆసుపత్రి

చల్లపల్లి: చల్లపల్లి మండలం, యార్లగడ్డ ప్రభుత్వ హోమియో వైద్యశాలలో వైద్యుడు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా దూరప్రాంతాల నుంచి రోగులు వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. తీరా ఇంత దూరం వచ్చాకా వైద్యుడు లేకపోయేసరికి నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఇప్పటివరకు హోమియో మందులను మాత్రమే వాడుకుంటూ రోగాలను తగ్గించుకుంటున్నామని వైద్యుడు లేకపోవడంతో ఇంగ్లీషు మందులు వాడాలంటే ఇబ్బందిగా ఉందని రోగులు చెబుతున్నారు. సైడ్ ఎఫెక్ట్స్ లేకపోవడం, తక్కువ ఖర్చు, పూర్తిస్థాయిలో రోగం కనుమరుగు అవుతుండటంతో అధికశాతం మంది ప్రజలు ప్రస్తుతం హోమియో వైద్యం పట్ల ఆకర్షితులవుతున్నారు.

సిబ్బంది ఖాళీ

గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ రవినాథ్ ఈ ఏడాది జూన్ 21వ తేదీన బదిలీపై వెళ్లిపోయారు. అయన స్థానంలో కోడూరు మండలంలోని సాలెంపాలెం ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వైద్యురాలు పి.మానసను ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. ఆమె మంగళ, గురు, శని వారాల్లో వచ్చి వెళుతుండేవారు. జాయిన్ అయిన వారం రోజుల్లోనే అనగా జులై 8వ తేదీన ఆమె ఆర్డర్‌ను రద్దుచేసుకుని ఇక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఇక్కడ వైద్యుడు లేక రోగులు అల్లాడుతున్నారు. ప్రతిరోజూ 30 నుంచి 40 మంది వరకు చికిత్స కోసం వచ్చి ఉపశమనం పొందేవారు. యార్లగడ్డ చుట్టుపక్కల గ్రామాలైన పురిటిగడ్డ, నడకుదురు, నిమ్మగడ్డ, రాముడుపాలెం, వెలివోలు, వేములపల్లి, చల్లపల్లి ప్రాంతాలతో పాటు విజయవాడ వంటి దూర ప్రాంతాల నుంచి కూడా ఏడు నుంచి పది మంది చొప్పున ఆటోలు కట్టించుకుని ఇక్కడికి హోమియో వైద్యం కోసం వచ్చేవారని పలువురు పేర్కొంటున్నారు. యార్లగడ్డ హోమియో ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ అధికారి(వైద్యుడి)తో పాటు, మేల్ నర్సింగ్ ఆర్డిలరీ, దాయా(రిసెప్షనిస్ట్), పార్ట్‌టైమ్ స్వీపర్ పోస్టులను కూడా వెంటనే భర్తీచేసి పూర్తిస్థాయిలో ప్రజలకు హోమియో వైద్యం అందుబాటులో ఉండేవిధంగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వెంటనే వైద్యుల్ని నియమించాలి



హోమియో వైద్యంలో యార్లగడ్డకు మంచిపేరు ఉంది. నేను గత రెండేళ్ల నుంచి ఇక్కడే మందులు వాడుతున్నా. వైద్యులు చక్కగా చూసి మందులు ఇచ్చేవారు. ఇప్పుడు డాక్టర్ లేకపోవడంతో చూడటంలేదు. పాతవారికే కాంపౌండర్ మందులు ఇస్తున్నారు. వెంటనే పూర్తిస్థాయి వైద్యుల్ని ఇక్కడ నియమించాలి.

అట్లూరి గోపాలరావు, యార్లగడ్డ

25 ఏళ్ల నుంచి వాడుతున్నా..



నేను ఈ ఊరు వచ్చి 25 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి హోమియో మందులే వాడుతున్నా. తప్పనిసరి అయితేనే ఇంగ్లీష్ మెడిసిన్ వాడతాం. హోమియో ద్వారా ఎన్నో ఆరోగ్య సమస్యలు తగ్గాయి. డాక్టర్ లేకపోవడం వల్ల చాలా మంది రోగులు ఇక్కడికి వచ్చి వెనుదిరిగిపోతున్నారు.

కవుతరపు రంగనాయకమ్మ, పురిటిగడ్డ

యూరియా దొరికేనా.. రైతు కష్టం తీరేనా..?

నందమూరులో పోలీస్ బందోబస్తు నడుమ టోకెన్లు జారీ



నందమూరు పీఏసీఎస్ వద్ద క్యూలో ఉన్న రైతులు



చినపాండ్రాకలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

పెడన: పెడన మండలం నందమూరు విశాల సహకార పరపతి సంఘానికి గురువారం రాత్రి యూరియా కట్టలు చేరాయి. సుమారు 550 కట్టలు రావడంతో శుక్రవార ఉదయమే బ్యాంకులకు రైతులు చేరుకున్నారు. పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ తమ సిబ్బందితో వచ్చి టోకెన్ల వారిగా రైతులను లైన్‌లో నిలబెట్టి యూరియా కట్టలు అందించేలా చర్యలు తీసుకున్నారు. నందమూరు పీఏసీఎస్ పరిధిలో బల్లిపర్రు, మడక, జింజేరు, అచ్చయ్యవారిపాలెం, కాకర్లమూడి, నందమూరు పంచాయతీలు, వాటి పరిధిలోని గ్రామాలు కూడా ఉండటంతో రైతులు యూరియా కోసం పెద్ద సంఖ్యలో బ్యాంకుకు చేరుకోవడంతో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక కట్ట తీసుకున్న రైతుకు ఆన్‌లైన్‌లో మరో కట్ట ఇవ్వకపోవడంతో పీఏసీఎస్ సిబ్బందికి, రైతులకు మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. రెండో కట్ట కొట్టే సమయం వచ్చిందని, తమకు రెండో కట్ట ఇవ్వాలంటూ రైతులు డిమాండ్ చేశారు. ఒకేసారి కట్టలు ఇవ్వకపోగా ఒక కట్ట తీసుకున్న రైతుకు మరో కట్ట ఇచ్చేందుకు ఆన్‌లైన్ సహకరించడం లేదని సహకార సిబ్బంది తెలిపారు. ప్రభుత్వం స్పందించి యూరియా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కోసం అన్నదాతలు అగచాట్లు

కృత్తివెన్ను: మండలంలో యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. కొంతమంది అవసరానికి మించి పలుకుబడితో యూరియాను ఎక్కువగా తీసుకుపోవడంతో తమకు కష్టాలు పెరిగాయని చిన్న, సన్నకారు రైతులు వాపోతున్నారు. శుక్రవారం చినపాండ్రాకలో వ్యవసాయశాఖ ద్వారా, కృత్తివెన్నులో సహకార సంఘం ద్వారా యూరియా పంపిణీ జరిగింది. అయితే స్టాక్ అరకొరగా రావడంతో యూరియా లేకుండానే రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లిపోయారు.

30 మెట్రిక్ టన్నుల పంపిణీ

అవనిగడ్డ: మండలంలోని పలు ప్రాంతాల్లో రైతులకు 30 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్టు ఏఓ శౌరమ్మ శుక్రవారం తెలిపారు. అవనిగడ్డ పీఏసీఎస్ నుంచి 10 మెట్రిక్ టన్నులు, అశ్వరావుపాలెం పీఏసీఎస్ ద్వారా 10, వేకనూరు పీఏసీఎస్ ద్వారా 10 మెట్రిక్ టన్నుల సరఫరా చేసినట్టు ఆమె తెలిపారు.

పచ్చ నేతలే పంపిణీ చేసేది

పెడన: యూరియా టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే పంపిణీ చేస్తున్నారనే విషయం కొప్పల్లి పంచాయతీలో తేటతెల్లమైంది. పెడన మండలం కొప్పల్లి పంచాయతీ కార్యాలయంలో రైతులకు శుక్రవారం రాత్రి ఏడు గంటలు దాటినా యూరియా పంపిణీ చేస్తూనే ఉన్నారు. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పచ్చచొక్కా వేసుకుని మరీ ఎవరికి ఇవ్వాలి.. ఎవరికి ఇవ్వకూడదో నిర్ణయిస్తూ పంపిణీ చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.



కొప్పల్లిలో పచ్చచొక్కా వేసుకుని యూరియా టోకెన్లు ఇస్తున్న టీడీపీ నాయకుడు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఘంటసాల: ఘంటసాల మండలం శ్రీకాకుళం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శ్రీకాకుళం, సూరపనేనిపాలెం, వీరమాచినేనిపాలెం, అచ్చెంపాలెం, తెలుగురావుపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం, చినకళ్లేపల్లి, వేములపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చల్లపల్లి: నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ మృతిచెందడంతో చల్లపల్లి వాసవీ క్లబ్ సభ్యులు అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరంకు చెందిన గొడవర్తి హేమలత(48) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో వాసవీ క్లబ్ తరపున రూ.7,500లు, శ్రీఆర్యవైశ్య సంఘం ద్వారా రూ.3వేలు మొత్తం రూ.10,500లు సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. వాసవీ క్లబ్ సభ్యుల సూచనల మేరకు హేమలత నేత్రాలను దానం చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు, కార్యదర్శి వరదా హరిగోపాల్, వాసవీ క్లబ్ సెక్రటరీ గోళ్ల వెంకటరత్నం పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ హైకోర్టు ఆన్‌లైన్ పరీక్ష

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏపీ హైకోర్టు ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి 10.30 గంటల వరకు జరిగిన మొదటి షిఫ్టులో 135 మందికి గాను 88 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.30 నుంచి రెండు గంటల వరకు జరిగిన రెండో షిఫ్టులో 180 మందికి గాను 111 మంది హాజరయ్యారని తెలిపారు.

కరకట్ట రక్షణ చర్యలు చేపట్టాలి

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): కృష్ణానదికి వరదనీరు ఉధృతం కానున్నందున కరకట్ట రక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులకు స్పష్టం చేశారు. మండలంలోని ఉత్తరచిరువోలులంక అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి వరద నీరు గ్రామంలోకి చొచ్చుకురాకుండా ఆర్సీ అధికారులు అడ్డుగా వేసిన ఇసుకమూటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజి నుంచి వరదనీరు 5 లక్షల క్యూసెక్కులకు మించే అవకాశం ఉన్నందున ఆ వరదనీరు అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గ్రామంలోకి చొచ్చుకు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇరిగేషన్ డీఈఈ బీబీఎన్ గణపతి, ప్రాజెక్టు కమిటీ దేవరబోయిన వెంకటేశ్వరావు, జనసేన, టీడీపీ మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, నడకుదుటి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

అవనిగడ్డ: సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ వద్ద చిరంజీవి యువత జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పికట్ల తారక మస్తాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నటనతో సినీరంగానికి ఖ్యాతి తెచ్చిన చిరంజీవి రక్తదాన శిబిరాల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ కార్యకర్తలు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణ మాస పూజలు

కృత్తివెన్ను: శ్రావణమాసంలో చివరి శుక్రవారం మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. గృహాల్లో లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

గోగినేనిపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో సీజనల్ వ్యాధులపై శ్రీకాకుళం పీహెచ్‌సీ అధికారులు శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధుల గురించి వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, ఆహార పదార్థాలు, పాత్రలపై మూతలు వేసుకోవాలని సూచించారు. హైస్కూల్ ప్రాంగణంలో దోమల నివారణ మందును పిచికారి చేయించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి పీఎస్ రాజు, హెచ్ఎం కృష్ణ కుమారి, ఏఎంసీ వైస్ చైర్మన్ అత్తలూరి గోపిచంద్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, ఎన్నారై గొర్రెపాటి రంగనాథ బాబు, ఏఎన్ఎం వనిత, శ్రీకాకుళం పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

పీసీఓడీపై అవగాహన

చల్లపల్లి: కమ్యూనిటీ సైన్స్ కళాశాల, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు లామ్‌ఫామ్‌కు చెందిన విద్యార్థినులు శుక్రవారం మండలంలోని పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్ విద్యార్థినులకు పీసీఓడీ(పాలీసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్) సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు బాలికలు, మహిళలో వచ్చే పీసీఓడీ కారణాలను, లక్షణాలు, వాటి ప్రభావాలు, ఎదురయ్యే సమస్యలను, వాటి చికిత్సను వివరించారు.

ఎడ్లంక వరద బాధితులు నిరసన దీక్ష

ఎడ్లంక(అవనిగడ్డ): వరద వల్ల తీవ్రంగా కోతకు గురవుతున్న ఎడ్లంక గ్రామానికి రక్షణ గోడ, వారధి నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు శుక్రవారం నిరసన దీక్ష చేపట్టారు. గ్రామం కోతకు గురవకుండా రక్షణ గోడ నిర్మించాలని, గ్రామానికి వంతెన నిర్మించాలని, వరద వల్ల ఇల్లు కూలిపోయిన వారికి ఇళ్ల స్థలం ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలని, పొలం కోతకు గురైన వారికి పొలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరద వచ్చినప్పుడల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామానికి వచ్చి అవి చేస్తాం, ఇవి చేస్తామని చెబుతున్నారే గానీ వరద తగ్గాక పట్టించుకున్నవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన సమస్యలు పరిష్కారం కోసం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు నిరసన దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామ ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్థానికుడు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ మాట్లాడుతూ ఎన్నికలు వచ్చినప్పుడల్లా రాజకీయ నాయకులు ఎడ్లంకకు ఎన్నో వరాలు ఇస్తున్నారని తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. గత రెండేళ్ల నుంచి వరదలకు గ్రామం తీవ్రంగా కోతకు గురవుతోందని, రక్షణ గోడ నిర్మించకుంటే ఐదారేళ్లలో ఎడ్లంక కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



ఎడ్లంకలో నిరసన దీక్ష చేస్తున్న గ్రామస్తులు

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు పర్యావరణానికి హానికరం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులు పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను కాకుండా గుడ్డ సంచులను వినియోగించాలని రైతు బజార్ ఎస్టేట్ అధికారి లంకే బలిచక్రవర్తి సూచించారు. రైతు బజార్ ఆవరణలో శుక్రవారం ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగం వల్ల జరిగే అనర్థాలను వివరించేందుకు రైతులు, వినియోగదారులతో ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే వినియోగదారులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను తీసుకురావద్దని సూచించారు. రైతు బజార్లో వ్యాపారులు కూడా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను విక్రయించొద్దని సూచించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగంతో పర్యావరణానికి హాని కలిగి మానవ మనుగడకు ఎంతో విఘాతం కలుగుతుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ గుడ్డ చేతి సంచులను మాత్రమే వినియోగించాలని కోరారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి నాటికి ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు బజార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వినియోగదారులకు అవగాహన కలిగిస్తున్న రైతు బజార్ ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి

వరి పొలాల పరిశీలన

ఘంటసాలపాలెం(ఘంటసాల): చిరు సంచుల దశలో వేసిన వరి విత్తనాల పంటలను రైతులు మంచిగా పండించాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఘంటసాల మండలం ఘంటసాలపాలెం గ్రామంలో చిరు సంచుల దశలో వేసిన ఎంటీయూ 1443, ఆర్‌జీఎల్7032, ఆర్‌జీఎల్7039 రకాల వరి పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ కృష్ణాజిల్లాకు అనుకూలతను పరిశీలించుటకు ఎంటీయూ 1443, ఆర్‌జీఎల్ 7034, ఆర్‌జీఎల్ 7039 వరి విత్తనాలను చిరు సంచుల దశలో అనుభవజ్ఞులైన కొంతమంది రైతులకు అందించినట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఘంటసాలపాలెంలో ఆయా రకాలను పండిస్తున్న రైతు ఉప్పల ప్రసాద్ పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఘంటసాలపాలెంలో వేసిన ఎంటీయూ 1443, ఆర్‌జీఎల్ 7034, ఆర్‌జీఎల్ 7039 వరి పంటలో మొక్క ఎత్తు, పిలకల సంఖ్య రికార్డు చేసి ఆయా పంటల యొక్క పనితీరును గమనించినట్లు చెప్పారు. అధిక వర్షాల తర్వాత వరి పొలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. పిలకల దశలో సాధారణ రకాలు ఐదు రోజుల వరకు నీట మునిగినా బతికే అవకాశం ఉందని, పిలక దశలో వరి పంట మునిగితే నీరు బయటకు తీసిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని సూచించారు. అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ఘంటసాలపాలెంలో వరి రకాల పంటలను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

మండలి పేరు పెట్టడంపై హర్షం

నాగాయలంక: ఉమ్మడి రాష్ట్ర విద్యాశాఖ మాజీ మంత్రి, దివంగత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాలకు నివాళిగా ఆయన పేరును తెలుగు అధికార భాషా సంఘానికి పెడుతూ క్యాబినెట్ ఆమోదించడంపై స్థానిక ఎంవీకేరావు శత జయంతి కమిటీ హర్షం ప్రకటించింది. ఈ మేరకు స్థానిక సాయిబాబాగుడి సెంటర్‌లో మండలి విగ్రహానికి కూటమి శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి భాషా సంఘానికి నామకరణం చేసినందుకు కృతజ్ఞతగా ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సర్పంచ్‌లు మండలి ఉదయభాస్కర్, అంబటి శ్యామ్ ప్రసాద్, కైతేపల్లి అంకాలు, డీసీ చైర్మన్ చినబాబు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మాచవరపు ఆదినారాయణ, టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు (చంటి) పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

కోసూరువారిపాలెం(మోపిదేవి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని, ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉంచకూడదని గ్రామ సర్పంచ్ కోసూరు అనూష సూచించారు. మండలంలోని కోసూరువారిపాలెంలో శుక్రవారం దోమల నివారణ మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనూష మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులు జాగ్రత్తలు పాటించాలని కోరారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తిచెందకుండా ముందస్తుగా గ్రామంలో అన్ని వీధుల్లోనూ ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

డీఎస్పీ విద్యశ్రీ



అవనిగడ్డ: వినాయక చవితి ఉత్సవాలు చేసుకునేందుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని డీఎస్పీ విద్యశ్రీ పేర్కొన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 11 రోజుల లోపు గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని, ఉత్సవాలకు డీజే అనుమతి లేదని, సాధారణ మైక్‌సిస్టమ్‌ని మాత్రమే వినియోగించాలని సూచించారు. గణేష్ మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చెప్పారు. ప్రతి ఒక్క ఉత్సవ కమిటీ పోలీసు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.

నాగాయలంక: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కలిదిండి రాజేష్ వినాయక ఉత్సవాల నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గొడవలు రహిత వినాయక ఉత్సవాల నిర్వహణే లక్ష్యంగా నిబంధనలు అమలు చేస్తున్నమని తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి గొడవలు జరిగినా కమిటీలదే బాధ్యత అని పేర్కొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకొందాం

కృత్తివెన్ను: వినాయక చవితి ఉత్సవాలను అందరూ సంతోషంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అందుకు ప్రజలంతా సహకరించాలని కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు కమిటీగా ఏర్పడి తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఊరేగింపుల్లో డీజే సౌండ్స్, అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సూచనలు తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొన్నారు.

సీబీసీఎన్‌సీ స్కూల్ తనిఖీ

ఘంటసాలపాలెం(ఘంటసాల): మండలంలోని ఘంటసాలపాలెం పంచాయతీ శివారు చాట్రగడ్డవానిగూడెంలోని సీబీసీఎన్‌సీ స్కూల్‌ను విద్యాశాఖ తరుపున అధికారులు శుక్రవారం ఆకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా పెనమలూరు, పామర్రు, నందివాడ ఎంఈఓలు శేషగిరిరావు, బి.శ్రీనివాస్, కె.శ్రీనివాసరావులు సీబీసీఎన్‌సీ స్కూల్లో మౌలిక వసతులు, ఫర్నీచర్, మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, మధ్యాహ్న భోజనం, ఆట స్థలం పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించామని, వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం కె.సాల్మన్ రాజు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

చల్లపల్లి: మండలంలోని లక్ష్మీపురంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీనాంచారమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. ఆలయంలో గత నాలుగు రోజుల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం తరపున హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాలు, రామాయణం, భాగవతం, భారతంపై పురాణ ప్రవచనాలు, భజనలు నిర్వహించారు. కమిటీ సభ్యులు దాలిపర్తి సుబ్బారావు, నారాయణ, కుటుంబరావు, శ్రీనివాసరావు, రాధాకృష్ణలు పర్యవేక్షించారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ఆలయాల్లో శుక్రవారం మహిళా భక్తులు అమ్మవార్లకు కుంకుమ పూజలు, వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. నగరంలోని రాబర్ట్‌సన్ పేటలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి మహిళా భక్తులు కుంకుమ పూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు పూజా సామాగ్రి, రూపులను, శివుని ప్రతిమలను ఆలయ ఈఓ సమ్మెట ఆంజనేయస్వామి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దేసు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు అందజేశారు. అలాగే నగరంలోని బచ్చుపేట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కుంకుమ పూజలు జరిగాయి. కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి కృష్ణారావు పర్యవేక్షించారు. నగరంలోని ఈడేపల్లిలో వేంచేసి ఉన్న శక్తి గుడిలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. నగరంలోని రాజుపేట ముత్యం గుడి, బెల్లం కోట్ల సందులోని మహాలక్ష్మి అమ్మవారు, ప్రధాన రహదారిలోని కనకదుర్గమ్మ, రేవతి సెంటర్లోని గంగానమ్మతల్లి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



మచిలీపట్నంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

కప్పలదొడ్డిలో..

గూడూరు: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని కప్పలదొడ్డిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. గ్రామంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి పాల్గొన్నారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

పారిశుద్ధ్య సిబ్బందిని హెచ్చరించిన ఏసీ గోపాలరావు



మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని అసిస్టెంట్ కమిషనర్ కేవీ గోపాలరావు హెచ్చరించారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం మీటింగ్ హాల్లో పారిశుద్ధ్య విభాగ అధికారులు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య విభాగంలోని అధికారులపై అవకతవకల ఆరోపణలు వస్తున్నాయని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అధికారులు, సిబ్బంది కార్మికులతో కలిసి నగరంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఉన్న లోపాలను గుర్తించి వాటిని అధిగమించి ఉన్నతాధికారుల మన్ననలు పొందేలా పనిచేయాలని చెప్పారు. సమావేశంలో హెల్త్ అసిస్టెంట్లు మహేష్, కిరణ్, శిరీష, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు మేస్త్రీలు పాల్గొన్నారు.